www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 16 నవంబర్ 2022
5
చిత్తూరు



అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

అర్హులందరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అందించాలని ఎస్‌బిసిసి కోఆర్డినేటర్ గాంధీరెడ్డి అన్నారు. మంగళవారం ఐరాల మండలంలోని రెడ్డివారిపల్లి సచివాలయం ఎంపిపి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని గాంధీరెడ్డి సందర్శించారు. ఆయుష్మాన్ భారత్‌కు సంబంధించి అర్హులను గుర్తించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో మహిళా పోలీస్ వాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ పవన్‌కుమార్, ఎఎన్‌ఎం హైమా, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో భారీగా పెరిగిన ఏనుగులు

- నిత్యం పంటలు ధ్వంసం
- గజదాడుల్లో పెరిగిన మరణాలు
- ఎప్పటికప్పుడు స్పందిస్తున్న ప్రభుత్వం
- కందకాలు, విద్యుత్ కంచేలను ఏర్పాటు చేస్తున్న అటవీశాఖ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లాలో మొత్తం అడవులు 29శాతం మేర విస్తరించి 1.95 లక్షల హెక్టర్లలో ఉన్నాయి. ఇందులో 353 చదరపు కిలోమీటర్లు కౌండిన్య రాయల్ ఎలిఫెంట్ జోన్‌ను ఏర్పాటు చేసి ఏనుగులను సంరక్షిస్తున్నారు. జిల్లాలో సుమారు మూడు నియోజకవర్గాల్లో ప్రధానంగా నిత్యం ఏనుగులు సంచరిస్తూ ఆహారం కోసం పంటపొలాల్లోకి రావడంతో రైతులకు ఇబ్బందికరంగా మారింది. అలాగే కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాలలో ప్రస్తుతం అనధికారిక లెక్కల ప్రకారం భారీ ఎత్తున ఏనుగులు ఉన్నాయని అంచనా.



ఇటీవల విద్యుత్ షాకుతో మృతి చెందిన ఏనుగు (ఫైల్)

అడవుల్లో జీవన్మరణ సమస్యతో ఏనుగులు జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. దీంతో ప్రజలు వాటిని తిరిగి అడవులలోకి తరిమేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈప్రయత్నాలలో కొంతమంది మరణించడం, అలాగే కొన్ని ఏనుగులు కూడా మరణించడం జరుగుతూనే ఉంది. గత మూడు సంవత్సరాల్లో జిల్లాలో 10 ఏనుగులు మరణించగా, 6 మంది రైతులు మరణించారు. సుమారు 3400చోట్ల పంట నష్టం జరిగింది. ప్రభుత్వం కూడా వెంటనే స్పందిస్తూ ఎప్పటికప్పుడు పరిహారం రైతులకు అందిస్తోంది. అదేవిధంగా మరణించిన వారి కుటుంబాలకు కూడా పరిహారం అందిస్తూ వారి ఆదుకోవడం జరుగుతోంది.

ఏనుగులు అటవీ ప్రాంతం నుంచి బయటకు రాకుండా కాంటూరు కందకాలు తవ్వడం, ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ అటవీశాఖ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటివరకు 70 కిలోమీటర్లకు పైగా సోలార్ ఫెన్సింగ్ వేయగా మరో 60కిలోమీటర్లు తవ్వడం జరిగింది. ప్రజలను భయాందోళన నుంచి బయటపడేసేందుకు ప్రభుత్వం తగుచర్యలు చేపడుతోంది. ఈనేపథ్యంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ట్రాకర్లను ఉపయోగించి పంటపొలాల వైపు వచ్చిన ఏనుగులను తిరిగి అటవీప్రాంతాల్లోకి ట్రాప్ చేయడం నిరంతరంగా జరిగే ప్రక్రియ. మొదట టపాకాయలు పేల్చి బయటకు పంపే ప్రక్రియతో పాటు ట్రాకర్లతో దారి మళ్ళించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంది. తాజాగా అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిర్ణయం మేరకు పలు ప్రాంతాలలో బేస్ క్యాంపులను ఏర్పాటు చేసి ఏనుగుల రాకపోకలను గమనించి రైతులను అప్రమత్తం చేయడానికి తగుచర్యలు తీసుకుంటున్నారు. ఈ క్యాంప్ ద్వారా సుమారు 78 కిలోమీటర్ల మేరకు అటవీ ప్రాంతంలో ఏనుగులు వచ్చి కదలికలు గుర్తించే అవకాశం ఉంది దీని ద్వారా ఏనుగులతో పాటు ఇతర జంతువులు కూడా గుర్తించవచ్చు.

చిత్తూరు జిల్లాలోని అటవీ ప్రాంతం అటు కర్ణాటక ఇటు తమిళనాడు ప్రాంతాలతో కలిసి ఉండడం వలన అటువైపు నుంచి కూడా ఏనుగులు చిత్తూరుజిల్లా వైపు వస్తుంటాయి. సత్యమంగళం ఫారెస్ట్ ప్రాంతం నుంచి కూడా చిత్తూరు జిల్లాలోకి భారీ ఎత్తున ఏనుగులు వస్తున్నాయని ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందుతోంది. ఇటీవల మంత్రి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జంతువుల వల్ల జరిగే పంటల నష్టాన్ని తగ్గించాలని, నష్టపరిహారాన్ని పెంచేలా ప్రభుత్వానికి నివేదిక పంపారు. కొత్తధరల ప్రకారం పరిహారం ఇవ్వాలని ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు. అదేవిధంగా అదేవిధంగా జాతీయ విపత్తు కింద ప్రకటించేలా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని కూడా కోరడం జరిగింది.

పొలానికి వెళ్లాలంటే భయం వేస్తోంది..
- యాగమూర్తి, గాండ్లపల్లి, మొగిలిగ్రామం, బంగారుపాల్యం మండలం



మా గ్రామం కౌండిన్య ఎలిఫెంట్ జోన్‌ప్రాంతం పక్కన ఉంటుంది. గ్రామం పక్కనే అటవీ ప్రాంతం ఉండడంతో నిత్యం ఏనుగులు వస్తూనే ఉంటాయి. ఈ ఏనుగులు రావడం వల్ల పంటపొలాల వైపు వెళ్లడానికి భయపడుతూ ఉన్నాం. పంట పొలాలను ధ్వంసం చేయడమేగాక ఒక్కోసారి పంటలను కాపాడుకొనే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రభుత్వ అధికారులు సకాలంలో స్పందిస్తున్న ఇటీవల కాలంలో ట్రాకర్లకు కూడా ఏనుగులు లోంగడం లేదు. వారు కూడా మరణిస్తున్నారు. విద్యుత్‌కంచే పనులు పూర్తి అయితే ఈ ప్రమాదం నుంచి బయటపడవచ్చు. మంగళవారం ఉదయం కూడా ఒక ఏనుగు గుంపులో వస్తుండగా వ్యవసాయ భావిలో పడిపోయింది. అధికారులు వెంటనే స్పందించి తగుచర్యలు తీసుకోవడం తో గండం గడిచింది. లేదంటే మరికొన్ని రోజుల పాటు ఏనుగుల ఆగ్రహావేశాలు చుడాల్సి వచ్చేది.

మా గ్రామానికి ఏనుగులు అధికంగా వస్తున్నాయి..
- గోవిందరెడ్డి, బేరుపల్లి, పలమనేరు మండలం

మా గ్రామం అటవీ ప్రాంతంలో ఉండడం వల్ల నిత్యం ఏనుగులు వస్తూ పోతూ ఉంటాయి. ఇతర ప్రాంతాల నుంచి కూడా ఏనుగులు వస్తుండడం వల్ల భారీ ఎత్తున మా ప్రాంతంలో ఏనుగులు సంచరిస్తున్నాయి.

జనవాసాల్లోకి రాకుండా చర్యలు చేపట్టాలి...
- చైతన్యకుమార్‌రెడ్డి, జిల్లా అటవీశాఖాధికారి



జిల్లాలో 1.95లక్షల హెక్టార్లలో అటవీ భూములున్నాయి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీఎత్తున ఏనుగులు వస్తుంటాయి. పంటనష్టం ఇంకా పెంచాలని అటవీశాఖ మంత్రి వర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వద్ద జరిగిన సమీక్షలో చెప్పడంతో వెంటనే ప్రతిపాదనలు పంపాము. అనుమతి రాగానే నూతన ధరలను ఇవ్వడం జరుగుతుంది. పంటల నష్టం, మనుషుల నష్టం జరగకుండా ట్రాకర్‌ల ద్వారా ఎంతగానో ప్రయత్నం చేస్తున్నాం. ప్రకతి వైపరీత్యాల ద్వారా ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. మంత్రి ప్రత్యేక శ్రద్ధ కారణంగా పలుప్రాంతాల్లో హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం జరుగుతోంది. మంగళవారం తెల్లవారుజామున బంగారుపాళ్యం మండలంలోని మొగిలి గ్రామంలో ఒక ఏనుగు గుంపులో నుంచి పొరపాటున బావిలో పడడం జరిగింది. అటవీ శాఖ అధికారులు రెస్క్యూ ఆపరేషన్ చేసి ఏనుగును తిరిగి గుంపులోకి కలిపేశారు.

బావిలో పడిన ఏనుగు

అటవీ శాఖ అధికారులపై రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం :

ఏనుగుల గుంపులోని ఓ ఏనుగు పొరపాటున వ్యవసాయ బావిలో పడిన సంఘటన చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మొగిలి పంచాయతీలోని గాండ్లపల్లిలో చోటుచేసుకుంది. డిఎఫ్ఓ చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మొగిలి పంచాయతీ గాండ్లపల్లి సమీపంలోని యశోదయ్య, త్యాగరాజరెడ్డి, దొరస్వామిరెడ్డి, నాగభూషణం రెడ్డిలకు చెందిన వరి పంటను సోమవారం రాత్రి తొమ్మిది ఏనుగులు గుంపుగా తొక్కి నాశనం చేశారు. అనంతరం పక్కనే ఉన్న జగన్నాథం నాయుడుకి చెందిన మామిడి తోపులోని బావిలో గుంపులోని ఓ ఏనుగు పడి పోయింది. రాత్రి నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. బావిలో ఏనుగును గమనించిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే వారు సంఘటనా స్థలానికి చేరుకుని ఏనుగును బయటికి తీసేందుకు ప్రయత్నాలు చేస్తుండగా కొందరు రైతులు అటవీ శాఖ వారి అడ్డుకున్నారు. తాము కష్టపడి పండించిన పంటలను తొక్కి నాశనం చేస్తున్న నష్టం కలిగిస్తున్న ఏనుగులను ఎందుకు సంరక్షించాలని ఆలోచనతో రావడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. సంఘటన స్థలానికి చేరుకున్న డిఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి, సిఐ నరసింహారెడ్డి, ఎస్సై మల్లికార్జున్ రెడ్డి, రేంజర్ నయం ఆలీ రైతులతో మాట్లాడి రైతులకు నష్టపరిహారం నమోదు చేస్తామని, నష్టపరిహారాన్ని త్వరలో అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శాంతించిన రైతులు ఏనుగును బయటకు తీసేందుకు జెసిబి సహాయంతో గాడికొట్టి ఏనుగును బయటకు తీసిసమీపంలోని అడవిలోకి మళ్లించారు.



బంగారుపాళ్యం మండలంలో బావిలో పడిన ఏనుగు

ఆన్‌లైన్ చేసుకోవాలంటే.. 5వేలు పట్టుకురా..

పెనుమూరు తహశీల్దార్ లైవ్ వీడియో సోషియల్ మీడియాలో హల్‌ఛల్
శాఖాపరమైన చర్యలు తప్పవు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:



పెనుమూరు తహశీల్దార్ రమణి

భూమికి సంబంధించి ఆన్‌లైన్ చేసుకోవాలా ముందే చెప్పాను కదా రూ.5వేలు అవుతుంది... తగ్గించుకోండి మేడమ్ అంటే ఎలా.. కుదరంటే కుదరదు... రూ.5 వేలు ఇస్తేనే సంతకం పెడతా... వెయ్యి, రెండు వేలు అంటూ బేరం మాడతావేంటి ఎలా ఇదేమైనా సంతలో కూరగాయాల వేపారమా... కుదరదు అడిగినంతా ఇచ్చుకోవాల్సిందే... ఈ మాటలన్నది ఏవ్వరో కాదు సాక్షాత్తు పెనుమూరు తహశీల్దార్ రమణి. తన భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కుచ్చుకొనేందుకు ఓ రైతు పెనుమూరు తహశీల్దార్‌ను ఆశ్రయించాడు. దీనికి రూ.5వేలు డిమాండ్ చేశారు తహశీల్దార్ రమణి. ఇది ఒక్కరైతు వద్దే కాదు మండలంలో రెవెన్యూకు సంబంధించి ఏ ఫైల్‌పైన సంతకం పేట్టాలన్నా ఓ రేటు నిర్ణయించింది. అడినంత ఇచ్చుకోవాల్సిందే.. తహశీల్దార్ రమణి తీరుపై విసుగుపోయిన బాధితులు తహశీల్దార్ లంచం అడుతున్న వీడియోను లైవ్‌తీసి సోషియల్ మీడియాలో పెట్టారు. జిల్లావ్యాప్తంగా పెనుమూరు తహశీల్దార్ వీడియో హల్‌చల్ చేస్తోంది. సోషియల్ మీడియాలో వచ్చిన వార్తపై స్పందించిన జిల్లా కలెక్టర్ శాఖారపమైన చర్యలు తీసుకుటామని ప్రకటించారు.

పెనుమూరు తహశీల్దార్ రమణి వివాదాస్పదంగా మారుతుంది. గతంలో గంగవరంలో జాతీయ రహదారి భూములకు రికార్డులు మార్చి కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారని ఇటీవల ఆమెను సస్పెండ్ చేశారు. అయితే ప్రస్తుతం పెనుమూరు తహశీల్దార్‌గా ఉన్న రమణి స్థానికంగా ఉన్న బాధితులను సైతం నగదు కోసం వేధిస్తూ వారిని మరింత మనోవేదనకు గురిచేస్తున్నారు. గతంలో ఇదే తహశీల్ధార్ కార్యాలయంలో ఒక రైతు రైతు కార్యాలయంలోని మతిచెందిన సంఘటన మరువకముందే.. మరికొందరు రైతుల పట్ల అదే కార్యాలయంలోని తహశీల్దార్ ఇలా వ్యవహరించడం వివాదాస్పదంగా మారింది.

క్వారీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్



ప్రజాశక్తి- పుంగనూరు: క్వారీ, గ్రానైట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. క్వారీ, గ్రానైట్లలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై మంగళవారం కార్మికుల జనరల్‌బాడీ సమావేశం పుంగునూరు మండలంలోని పాళ్యెంపల్లిలో జరిగింది. ఈ సమావేశానికి నరేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు జిల్లా అధ్యక్షులు వాడ గంగరాజు, జిల్లా నాయకులు మురళి మాట్లాడుతూ క్వారీ, గ్రానైట్ కార్మికులు చేస్తున్న పని చాలా ప్రమాదకరమైన పని అని, పనికి తగ్గట్టు వేతనాలు అందడం లేదని విమర్శించారు. జిల్లావ్యాప్తంగా వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని వీరంతా అనారోగ్యానికి గురవుతున్నారని, దుమ్ము, దూళితో నిత్యం పనిచేస్తున్నారన్నారు. బ్లాస్టింగ్లు సమయంలో ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉందని, రాళ్లు కదిలే టైంలో దొర్లుకొని చనిపోతున్న పరిస్థితి ఉందని ఇటువంటి సందర్భాల్లో మృతుల కుటుంబాలను ఆదుకోవడానికి నష్టపరిహారం అందడం లేదన్నారు. కార్మికులు ఇంత కష్టపడుతున్న ప్రభుత్వ జీవోలు ప్రకారం కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని, అమలు చేయించాల్సిన లేబర్ అధికారులు అటు వైపు చూడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యాలు లాభాలు అర్జిస్తున్న కార్మికుల బాగోగులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లా క్వారీ అండ్ గ్రానైట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా మురళి, గౌరవసలహాదారులుగా వాడ గంగరాజు, అధ్యక్షులు నరేష్‌కుమార్, కార్యదర్శి పి.మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మంజునాథ్, హేమంత్ కుమార్‌రెడ్డి, సహాయ కార్యదర్శి వెంకటా చలపతి, మధుసూదన్ రెడ్డి, కోశాధికారి హరి కుమార్ రెడ్డిలతో పాటు 8 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.

'కిట్' తో సంపూర్ణ ఆరోగ్యం

పేదలలో పెరుగుతున్న ఆసక్తి

ప్రజాశక్తి- చిత్తూరుప్రతినిధి:

బడుగు బలహీన వర్గాల గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు అందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా సంపూర్ణ ఆరోగ్య కిట్లు అందిస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ లాంటి బహత్తర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు చేస్తోంది. ఈ పథకాల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందిస్తోంది. దీంతోపాటు వైఎస్సార్ అమత హస్తం, మధ్యాహ్న భోజన పథకం, బాలామతం, వైఎస్సార్ బాల సంజీవని పథకాలు కూడా అమలవుతున్నాయి.

గర్భిణులు, బాలింతలకు చిన్నపిల్లలకు నెలలో 25 రోజులపాటు పాలు, గుడ్లు, పప్పు, కూరగాయలు, ఆకుకూరలు, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. ఇందులో టేక్ హోమ్ న్యూట్రిషన్ కిట్ ద్వారా నెలకు 2కిలోల మల్టీ గ్రెయిన్ ఆటా, అర కిలో వేరుశనగ చిక్కీ, అరకిలో రాగి పిండి, అరకిలో బెల్లం, అరకిలో ఎండు ఖర్జూరం పంపిణీ చేస్తున్నారు. అలాగే 36 నుంచి 72నెలల లోపున్న చిన్నారులకు నెలలో 25 రోజులపాటు వేడిఅన్నం, పప్పు, కూరగాయలు, ఆకుకూరలతోపాటు 200మిల్లీ లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు, 50గ్రాముల బాలామతం లడ్డు తదితర పోషకాహార పదార్థాలు ఇస్తున్నారు. 7 నుంచి 36 నెలలలోపున్న చిన్నారులకు టేక్ హోం న్యూట్రిషన్ కిట్ కింద నెలకు 2.5కిలోల బాలామతం, 25 కోడి గుడ్లు, 5 లీటర్ల పాలు అందిస్తున్నారు.

చిత్తూరు జిల్లాలో ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2420 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. అందులో 1795 మెయిన్, 625 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. 1047 అంగన్వాడీ కేంద్రాలు ప్రభుత్వభవనాలలోనూ, 654 అంగన్వాడీ కేంద్రాలు అద్దెభవనాల్లోనూ, 719 అంగన్వాడీ కేంద్రాలు ఉచిత భవనాలలో ఉన్నాయి. జిల్లాలోని 2420 అంగన్వాడీ కేంద్రాల్లో 60,965 మంది వైఎస్సార్ సంపూర్ణ కిట్ పొందుతున్నారు. 7 నెలల నుంచి 3 సంవత్సరాలలోపు 30,866మంది పిల్లలు, 23,872 మంది గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషన్ కిట్ అందిస్తున్నారు. కమ్యూనిటీ బెస్ట్ ఈవెంట్స్ పోషణాభియాన్‌లో భాగంగా గర్భిణులు, బాలింతలకు పోషణవిలువలను పెంపొందించుటలో అవగాహన కార్యక్రమాలు, శ్రీమంతాలు, అన్నప్రాసన వంటి కార్యక్రమాలపై గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నారు.

సమగ్ర బాలల పరిరక్షణ..

ఈపథకం ద్వారా 0 నుంచి 8 సంవత్సరాలలోపు ఉన్న బాలబాలికలకు రక్షణ, సంరక్షణ కల్పించ బడుతుంది. జిల్లాలో ఇప్పటి వరకు 10 బాల్యవివాహాలను అడ్డుకున్నారు. ఫోక్స్ చట్టం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 42 కేసులు నమోదు చేశారు.

సంపూర్ణ ఆరోగ్యానికి - పోషన్ కిట్..
- ఆర్.నూసరత్, గర్భిణీ



గర్భం దాల్చిన సమయంలో నాలుగు నెలల ముందు అంగన్వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకున్నాను. నమోదు నాటికి నాకు రక్తం 8.5శాతం ఉండేది. అంగన్వాడీ కార్యకర్తలు పేరు నమోదు చేసుకున్న తరువాత ప్రతినెలా వైఎస్సార్ సంపూర్ణ పోషన్ కిట్స్ ఇంటికి సరఫరా చేసిన వస్తువులు ఏవిధంగా వాడుకోవాలని సంపూర్ణంగా అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రంలో నమోదు చేసుకున్న గర్భవతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రభుత్వం సరఫరా చేసిన వస్తువులు వినియోగించడం వల్ల ఐదు నెలల తర్వాత 10.5 శాతం హిమోగ్లోబిన్ పెరిగింది.



అంగన్వాడీ సెంటర్‌లో పిల్లలకు భోజనం పెడుతున్న సిబ్బంది

పేదల ఆరోగ్యానికి కిట్స్..
- ప్రసన్న, బాలింత




నేను మొదటిసారిగా గర్భం దాల్చిన తర్వాత అంగన్వాడీ కేంద్రంలో నా పేరు నమోదు చేసుకోవడం జరిగింది. ప్రతిరోజు మధ్యాహ్నం అంగన్వాడీ కేంద్రంలో కోడిగుడ్డు, ఆకుకూరలు, కూరగాయలతో చేసిన భోజన పెట్టేవారు. అలాగే ప్రతినెలా వైఎస్సార్ పోషన్ కిటును ఇవ్వడంతో నా మొదటి కాన్పు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగింది. తల్లీబిడ్డ ఇద్దరం క్షేమంగా ఉన్నాం. మాపాపను గత సంవత్సరం నుండి అంగన్వాడీ కేంద్రానికి పంపుతున్నామని, 5.2 కేజీల బరువు, 62 సెంటీమీటర్ల ఎత్తు ఉన్న హర్షిత 3 సంవత్సరాల అమ్మాయి ఆరు నెలల నుండి ప్రీస్కూల్‌కు పంపడం వల్ల ప్రతి రోజు 9.30 గంటలకు పాలు, 10.30గంటలకు గుడ్డు, మధ్యాహ్న భోజనంలో ఆకుకూరలు కూరగాయలతో కూడిన భోజనం, మధ్యాహ్నం 3 గంటలకు స్నాక్స్ కింద ఉడకబెట్టిన శనగలు తదితర పోషక ఆహారపదార్థాలు ఇస్తున్నారు. దీని వలన పాప వయసుకు తగ్గ బరువుతో పాటు ఆరోగ్యంగా ఉంది. నాకు నా కూతురు ఇద్దరికి అంగన్వాడీ కేంద్రంలో మంచి న్యాణ్యతమైన భోజనం చేయడంతో ఆరోగ్యంగా ఉన్నాం.



అంగన్వాడీ సెంటర్‌లో భోజనం చేస్తున్న గర్భిణులు, బాలింతలు

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించండి: కలెక్టర్




ఉద్యానవనశాఖ అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఉద్యానపంటల సాగుకు అదనంగా రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందేందుకు అవకాశం ఉన్న ఉద్యానపంటల సాగుకు సంబంధించిన అవగాహనను తీసుకురావాలని జిల్లాకలెక్టర్ యం. హరినారాయణన్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్ రెడ్డిని ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో ఉద్యానశాఖకు సంబంధించి పథకాల అమలుతీరు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ఉద్యానవన శాఖాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యాన పంటలసాగుకు రైతులు బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను వినియోగిస్తున్నారని, దీనితో పాటు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందేలా రైతులకు సచివాలయాల్లోని హార్టికల్చర్ వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా మరింత అవగాహన తీసుకురావలసిన అవసరం కలదన్నారు. జిల్లాలో కూరగాయల సాగును కూడా ప్రోత్సహించాలని సూచిస్తూ ఉద్యాన పంటల సాగు క్రింద ఉన్న విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. తమిళనాడుకు చెందిన క్రిష్ణగిరిలో టమాటో, మ్యాంగో, కోకోనట్‌కు సంబంధించి సోలార్‌డ్రయర్లతో డ్రీహైడ్రేషన్ సాగుకు సంబంధించిన పద్ధతులను అధ్యయనం చేయాలని ఉద్యానశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకంపై మరింత అవగాహన తీసుకుని వచ్చేందుకు స్వయం సహాయక సంఘాల మహిళలతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఈ పథకంను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఎక్కువ మంది ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. ఈ పథకంను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు డిఆర్డిఏ, మెప్మా శాఖల సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. జిల్లాలో 1,51,000 ఎకరాలలో ఉద్యాన పంట సాగు ఉండగా అందులో 1,24,000 ఎకరాలు పండ్ల తోటల పెంపకం కలదని ఇందులో భాగంగా 24మండలాల్లో 52,000 హెక్టార్లలో మామిడి పంట సాగు అవుచున్నదని, టమోటా సాగు విస్తీర్ణం కూడా ఎక్కువ కలదని, రాష్ట్రీయ కషి వికాస్ యోజన ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్ అండ్ అగ్రికల్చర్ ట్రాన్స్ఫర్మేషన్ ప్రాజెక్ట్, ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ అండ్ లైవ్లీ హుడ్ ఇంప్రూవ్మెంట్ ప్రాజెక్ట్, మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఆఫ్ హార్టికల్చర్ పథకాలు అమలవుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2022-23 సంవత్సరంలో ఏపిఎంఐపి ద్వారా 9,800హెక్టార్లలో పంట సాగుకు అవసరమైన బిందు, తుంపర్ల సేద్య పరికరాలు అందజేసేందుకు ఆమోదం తెలిపారని, ఉద్యాన శాఖ అధికారి కలెక్టర్ కు వివరించారు.

22న ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

ఈనెల 22న ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్‌కు ధర్నాకు సంబంధించిన నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ ఉమ్మడి జిల్లా నాయకులు ముత్యాలరెడ్డి, జివి.రమణ, సూర్యప్రకాస్, దక్షిణామూర్తి, ఎస్‌ఎం బాషాలు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధి పిఎఫ్ ఏపీజీఎల్ఐడి ఏరియర్లు, సెరెండర్ లీవులు వంటి ఆర్థిక సంబంధమైన బకాయిలు విడుదల చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల కలెక్టరేట్ల వద్ద ఈనెల 22వ తేది ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



డిఆర్ఒకు నోటీసు అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

గడపగడపకూ డిప్యూటీ సీఎం



ప్రజాశక్తి - వెదురుకుప్పం : మండలంలోని ఆళ్లమడుగు కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి నవరత్నాల లబ్ధిపై ఆరా తీశారు. జెడ్పీటీసీ చలంపాళ్యం సుకుమార్, వైసీపీ సీనియర్ నేత శింగం హేమశేఖర్ రెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కామసాని పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



రవి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎంపీపీ లతబాలాజీ

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన సీ.రవి కొన్నాళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎంపీపీ లతబాలాజీ, సర్పంచ్ భారతి కలసి మంగళవారం మృతి చెందిన రవి భార్య బుజ్జికి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్ భీమా కింద మృతి చెందిన కుటుంబానికి ప్రభుత్వం రూ.లక్ష అందించి ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ ధనంజయవర్మ, వైసీపీ నాయకుడు, ధనశేఖర్ వర్మ, ధన్‌రాజ్ పలువురు పాల్గొన్నారు.

మంత్రి సహకారంతో ఆసుపత్రి అభివృద్ధి

విశ్రాంత డిఎస్పి



ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో ఎంతో అభివృద్ధి చెందిందని విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు అన్నారు. ప్రగతి దాత వాలంటీర్ సేవా సంస్థ ఫౌండర్, విశ్రాంతి డిఎస్పి కే.సుకుమార్ బాబు పుంగనూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ఫ్లాస్క్, డిన్నర్ సెట్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యం అందిస్తారని చాలా సంతోషించదగ్గ విషయం అన్నారు. గతంలో పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ శరన్ కుమార్ రెడ్డి, సభ్యులు సత్యనారాయణ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకే ప్రాధాన్యం

పంచాయతీ కార్యదర్శి జయశంకర్



ప్రజాశక్తి- సోమల : పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం చేస్తున్నట్టు మేజర్ పంచాయితీ కేంద్రమైన కందూరు కార్యదర్శి జయశంకర్ అన్నారు. మంగళవారం ఆయన గ్రామంలోని వీధులలో పారిశుధ్య కార్మికులతో వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేయించారు. ప్రజలు కూడా చెత్త చెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయకుండా పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈవోఆర్డీ గఫూర్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సీఐ జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి -పుంగనూరు: మండలంలోని రూరల్ గూడూరు పల్లి ప్రభుత్వ పాఠశాలలో భగవాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీఐ గంగిరెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పిల్లలకు పంపిణీ చేసి వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న40 మంది పేద విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేష్ నారాయణ, భగవాన్ ట్రస్ట్ ప్రెసిడెంట్ లయన్ ఈశ్వరమ్మ, జీవీ రమణ, నరసింహులు, రఘు, మస్తాన్ వల్లి, అమర్నాథ్ రెడ్డి, సురేష్ రెడ్డి, ప్రకాష్ పాల్గొన్నారు.

పారదర్శకంగా స్వమిత్వ నిర్వహణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వమిత్వ (గ్రామ కంఠం రీసర్వే)ను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్ అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలోని 822 గ్రామాలకు గాను 717 గ్రామాలలో డ్రోన్ ఫ్లయింగ్ పూర్తయిందని..8 గ్రామాలలో గ్రౌండ్ ట్రూథింగ్ పూర్తిచేయడం జరిగిందని, ఇప్పటివరకు 96 గ్రామాలకు సంబంధించి ఓఆర్ఐ రావడం జరిగిందని తెలిపారు. అలాగే గ్రౌండ్ వాలిడేషన్ రెండు గ్రామాల్లో గ్రౌండ్ ట్రూథింగ్ నిర్వహించే సమయంలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ రీసర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించేందుకు అన్నిచర్యలు తీసుకుంటామని కమిషనర్‌కు వివరించారు. డీపీవో లక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలతోనే రాష్ట్రాభివృద్ధి

ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు



ప్రజాశక్తి -బంగారుపాలెం : సంక్షేమ ఫలాలతోనే రాష్ట్రాభివృద్ధి అని ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని ఈచినేరిపల్లి సచివాలయం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఎంపీడీవో శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర లో చెప్పిన విధంగా అధికారం చేపట్టిన అప్పటినుంచి నవరత్నాల పథకాన్ని ప్రారంభించి పేద బడుగు బలహీన వర్గాలను అభివృద్ధి చెందే విధంగా చేస్తున్నారని ఇచ్చిన హామీలను 95 శాతం పూర్తి చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీలు శిరీష్ రెడ్డి, జయప్రకాష్, జెడ్పిటిసి సోమశేఖర్, తహశీల్దార్ బెన్‌రాజ్, పలువురు మండల స్థాయి అధికారులు, నాయకులు మాజీ సర్పంచ్ శరత్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, అన్నమల్ రెడ్డి, పలువురు సచివాలయ సిబ్బంది, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

గ్రామీణ క్రీడలపై ఆసక్తి చూపండి

ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సుభాన్



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: గ్రామీణ క్రీడల పట్ల ఆసక్తి చూపాలని ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సుభాన్ అన్నారు. మంగళవారం మండలంలోని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ ఖోఖో క్రీడాకారిణి ఎంపిక పట్ల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలకు చెందిన హష్మిత జూనియర్స్ కోకో విభాగంలో జాతీయ జట్టులో స్థానం పొందిందని, ఇచ్ఛాపురంలో గత నెలలో జరిగిన శిక్షణా శిబిరంలో పాల్గొన్నట్లు తెలిపారు. అక్టోబర్ 29 నుండి నవంబర్ 2 వరకు మహారాష్ట్రలోని పూణేలో జరిగిన జాతీయక్రీడల్లో పాల్గొని విజయాలు సాధించారని అలాగే అక్టోబర్ నెలలో 21, 22, 23 తేదీలలో ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలలో మదన్ పాల్గొన్నాడని తెలిపారు. రాష్ట్ర ఖోఖో జట్టుకు ప్రాతినిధ్యం వహించిన పాఠశాలకు చెందిన చరణ్ వినయ్ కుమార్, దివ్య, నిఖిత, ప్రచోదని, వర్షిణిలకు బహుమతులనిచ్చి అభినందించారు విద్యార్థిని విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకొని క్రీడల్లో రాణించాలన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణురెడ్డి, షంషీర్ ఖాన్, రవిచంద్రారెడ్డి, వెంకట స్వామి, విజయకుమారి, శుభలక్ష్మి, జయప్రకాష్, మోహన్ రెడ్డి, కుసుమకుమారి, దేవేంద్ర పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు చేయిచేయి కలుపుదాం



కుష్టు వ్యాధిపై సూచనలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- సోమల: కుష్టువ్యాధి సమూల నిర్మూలన కోసం చేయి చేయి కలిపి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలని కందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు నీలిమ, విజయలక్ష్మి కోరారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 15వ తేదీ నుండి డిసెంబర్ 5వ తేదీ వరకు గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం స్పర్శలేని మచ్చలు ఉంటే గుర్తించడం, ముఖం, చెవి, ఎద, వీపు మీద స్పర్శలేని బుడిపెలు, కనురెప్పలు, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం, కాళ్ల చేతులు తిమ్మిర్లు, వాపులు రావడం, గాలి ఆడక పోవడం తదితర లక్షణాలు ఉంటే కుష్టువ్యాధి లక్షణాలుగా గుర్తించి అలాంటివారికి వైద్య సేవలు అందజేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఇప్పటికే గ్రామాలలో ఆశ, ఏఎన్ఎంల ద్వారా సర్వే నిర్వహించామని ఇంకా ఎవరైనా లక్షణాలు కలిగిన వారు ఉంటే ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించి ఉచిత వైద్యం, చికిత్స, మందులు పొందవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బైరెడ్డిపల్లి: స్థానిక మండల కేంద్రంలోని చంద్రబాబు నాయుడు కాలనీ బైరెడ్డిపల్లిలో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సావిత్రి హెల్త్ ఎడ్యుకేటర్ మాట్లాడుతూ కుష్టివ్యాధి గురించి సమావేశానికి హాజరైన వారికి తెలియజేశారు. అనంతరం వైద్య బృందం కలిసి కాలనీలో ఇంటింటి సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ అనూరాధ, ఏఎన్ఎం లక్ష్మి, ఆశాలు రాజేశ్వరి, అంగన్వాడి టీచర్, నిర్మల దీప పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్లో నాణ్యత ఉండాలి

అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్



సిఆర్పీలతో సమావేశం నిర్వహించిన వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి -పలమనేరు: నాడు - నేడు పనులలో నాణ్యత కచ్చితంగా ఉండాలని పాఠశాలలో కంప్లైంట్ బాక్స్, గోడ పత్రికలు, టోల్ ఫ్రీ నంబర్ 1440ను కచ్చితంగా అమలు చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ వెంకటరమణా రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని విద్యానగర్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఆయన పరిశీలించారు. రివాల్వింగ్ ఫండ్ ఎంత వచ్చింది ఎంత ఖర్చు అయ్యిందనే విషయాన్ని హెడ్ మాస్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే భవిత కేంద్రాన్ని సందర్శించి పిల్లలను విచారించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండల విద్యా శాఖాధికారి కార్యాలయంలో సిఆర్‌పిలతో సమావేశం నిర్వహించి బడి బయట పిల్లల వివరాలు గురించి అడిగి తెలుసుకుని ఆన్లైన్‌లో వారి వివరాలు నమోదు చేయాలన్నారు. అలాగే జగనన్న విద్యా కానుకను మండలంలో అందరి పిల్లల చేత బయోమెట్రిక్ పూర్తి గా వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారిణి లీలారాణి, ప్రత్యామ్నాయ పాఠశాలల కో-ఆర్డినేటర్ అజయ్ కుమార్ రెడ్డి, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

'జగనన్న స్వచ్ఛ సంకల్పం' పటిష్టంగా అమలు చేయాలి

జిల్లా కలెక్టర్ హరినారాయణన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని.. ఈవోపీఆర్డీలు సంబంధిత పంచాయతీ సెక్రటరీలతో సమన్వయం చేసుకుని అమలు చేయాలని జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్ అన్నారు. మంగళవారం డీపీవో లక్ష్మీ, ఈవోపీఆర్డీలతో జిల్లా కలెక్టర్ జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లతో గ్రామాల్లో తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని.. వర్మీకంపోస్టు నుంచి ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఇంకనూ నిర్మాణం చేపట్టని కేంద్రాల నిర్మానాలను పూర్తిచేయాలన్నారు. తాగునీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఓసారి శుభ్రం చేయించాలని.. ఫొటోలను స్వచ్ఛ సంకల్ప యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామాల్లో పన్నుల చెల్లింపులు సకాలంలో జరిగేలా చూడాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 717 గ్రామాలలో డ్రోన్ సర్వే పూర్తి అయిందని, 95 గ్రామాల్లో రీసర్వేకు గానూ 8 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి అయిందని డీపీవో కలెక్టర్‌కు వివరించారు.

ఎన్‌జీవో సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఎన్‌జీవోల సంఘం నూతనకార్యవర్గం ఏర్పాటు మంగళవారం స్థానిక ఎన్‌జీవో హోంలో జరిగాయి. ఎన్నికల అధికారి లలిత్‌కుమార్, సహాయ ఎన్నికల అధికారి ఉమాపతి, పరిశీలకులుగా బాలసుబ్రహ్మణ్యం వ్యవహరించారు. ఏపీ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా భానుప్రకాష్, సహాధ్యక్షులుగా చలపతినాయుడు, ఉపాధ్యక్షులుగా రవికుమార్, పూమాల, సుభాన్‌బాషా, సాయిప్రశాంతి, కార్యదర్శిగా ప్రసాద్‌బాబు, సహాయ కార్యదర్శులుగా పెరుమాళ్, మురళీమోహన్, సుబ్రమణ్యం, మురళి, సుదరప్రియ, గురునాథం మురుగేష్, ఆనందకుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యుల కాలపరిమితి మూడేళ్లపాటు ఉంటుందని ఎన్నికల అధికారి తెలిపారు.

పోటీ పరీక్షలకు గ్రంథాలయాలు దోహదపడతాయి

ప్రజాశక్తి-కార్వేటినగరం: గ్రంథాలయాలు పోటీ పరీక్షలకు ఎంతో దోహదపడతాయని ఆర్కేఎస్సార్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలసుబ్రమణ్యంరాజు అన్నారు. గ్రంథాలయ వారొత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ బాల సుబ్రమణ్యం మాట్లాడుతూ భవిష్యత్తుకు పురాతన గ్రంథాలే సోపానాలని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కే.మునిరత్నం, వెంకటేశ్వర్లు, జనార్ధన్, రాఘవేంద్రరాజు పాల్గొన్నారు.

సోమల : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా రెండవ రోజు పుస్తకాల ప్రదర్శన, పుస్తక పఠన ప్రాధాన్యత అంశాలపై గ్రంథాలయ అధికారి రామకృష్ణ విద్యార్థులకు సలహాలు అందజేశారు. ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు గ్రంథాలయంలోని పలు కథల, దేశ నాయకుల పుస్తకాలను పరిచయం చేసి నిత్యం పుస్తక పఠనంతోనే జ్ఞానం పెంపొందుతుందని తెలియజేశారు.



నష్ట పరిహారం అందించండి

పలువురు రైతుల ఆవేదన

ప్రజాశక్తి - బంగారుపాళ్యం : ఏనుగు దాడిలో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని మొగిలి పంచాయతీ గాండ్లపల్లి గ్రామానికి చెందిన యశోదయ్య, త్యాగరాజ రెడ్డి, దొరస్వామి రెడ్డి, నాగభూషణం రెడ్డిలకు సంబంధించిన వరిపంటను సోమవారం రాత్రి తొమ్మిది ఏనుగుల గుంపు తొక్కి నాశనం చేశాయి. పంట చేతికొచ్చే సమయంలో ఏనుగుల వలన నష్టపరిహారం చోటు చేసుకుం టుందని సంబంధిత అధికారులు త్వరగా పంట నష్టపరిహారాన్ని అంచనా వేసి తదుపరి పంటకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: మండలంలోని పెద్దకాల్వ పంచాయతీ ఎన్టీఆర్ కాలనీలో ప్రాథమిక పాఠశాల వద్ద జరుగుతున్న నాడు -నేడు పనులను ఎంపీడీవో శ్రీదేవి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ పాఠశాల, అంగన్‌వాడి టీచర్ల వద్ద నాడు-నేడు పనులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతంగా ముందుకు సాగించడానికి దృష్టి సారించాలని పనులు చేస్తున్న వారిని ఆదేశించారు.



విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించాలి

ప్రజాశక్తి-సోమల: పాఠశాల విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని ఉపాధ్యాయులు పెంపొందింప జేయాలని మండల విద్యాశాఖ అధికారి కేశవ పిళ్లై కోరారు. మంగళవారం ఆయన పొదలకుంటపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్నం భోజనం రుచి చూశారు. అనంతరం విద్యార్థుల పఠణా సామర్థ్యాన్ని తెలుసు కునేందుకు విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలను రాబట్టారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.


పెరటికోళ్ల పంపిణీ



ప్రజాశక్తి -పలమనేరు : మండల మహిళా సమాఖ్య పలమనేరు మండలం ఆధ్వర్యంలో బయప్పగారిపల్లి పంచాయతీ మహిళా సంఘాల సభ్యులకు 120 యూనిట్లలో ఒక్కో యూనిట్‌కు 11 పెరటి కోళ్లు పంపిణీ చేశారు. వైసీపీ మండల కన్వీనర్ బాలాజీ నాయుడు చేతుల మీదుగా సంఘాల సభ్యులకు అందజేశారు. సర్పంచ్ బుజ్జమ్మ ఎర్రయ్య, ఎంపీటీసీ రమేష్, ఏపిఎం మొగలీ శ్వరయ్య, సీసీలు, సంఘమిత్రులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వాహనాలు నడపరాదు

పలమనేరు ఎస్ఐ నాగరాజు



వాహనదారులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి -పలమనేరు : నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వాహనదారులకు పలమనేరు సరిహద్దులో పోలీసులు కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలపై నిర్లక్ష్యంగా వాహనాలు నడిపేవారికి కౌన్సిలింగ్ ఇచ్చి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ నిర్లక్ష్యపాయంగా వాహనాలు నడపడం ప్రమాదకరమని అన్నారు. రోడ్డుపైకి వచ్చేటప్పుడు జాగ్రత్త తీసుకొని రావాలని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. నిర్లక్ష్యంగా రోడ్డుపైకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

పౌరులకు అత్యుత్తమ సేవలందించాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వార్డు సచివాలయాల పరిధిలో ప్రజలకు సేవలు అత్యుత్తమంగా అందించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ వార్డు కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ నగరపాలక సంస్థ పరిధిలోని 9,10 వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాల యంలో కార్యదర్శుల హాజరు, రికార్డులను పరిశీలించారు. కార్యదర్శులందరూ తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని.. యూనిఫాం ధరించాలని సూచించారు. మేనేజర్ ఉమామహేశ్వరరెడ్డి, మెప్మా సీఎంఎం గోపి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో వైద్యసేవలు మరింతగా మెరుగుపరిచి సీజనల్ వ్యాధులపై అత్యంత జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ అన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.

సీసీ రోడ్ల నిధులను ఖర్చు చేయాలి

ప్రజాశక్తి-రొంపిచెర్ల: గ్రామాలలో మురుగుతున్న సీసీ రోడ్ల నిధులను వెంటనే ఖర్చు చేయాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీసీ రోడ్ల నిర్మాణం కోసం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రెండు సంవత్సరాల క్రితం నిధులను మంజూరు చేశారని తెలిపారు. అయినా కొన్ని గ్రామాలలో సీసీ రోడ్డు పనులు ఇంకా చేయలేదని మండిపడ్డారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటన డిసెంబర్ నెలలో ఉంటుందని ఆలోపు మిగిలిన పనులను పూర్తి చేయాలని కోరారు. గ్రామాలలో ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి రెడ్డీశ్వర్ రెడ్డి, మంత్రి పీఏ మునితుకారం, వైస్ ఎంపీపీ విజయ్ శేఖర్ బాబు, ఎంపీడీవో రాజేంద్ర, సింగల్ విండో అధ్యక్షులు హరినాథరెడ్డి, సర్పంచులు ఇబ్రహీంఖాన్, నాగిరెడ్డి, అన్సర్ భాష, బీసీ సెల్ మండల అధ్యక్షులు వెంకటరమణ, ఎంపీటీసీలు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించేందుకే సాంస్కృతిక కార్యక్రమాలు

కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ శారదా దేవి

ప్రజాశక్తి -వెదురుకుప్పం: విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉపయోగపడతాయని, కళాశాల విద్యలోనే వాటిని మెరుగుపరుచుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అన్నపూర్ణ శారద అన్నారు. మంగళవారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ ఫ్యాకల్టీ డా. ప్రసన్న లత, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ డా వెంకటేష్ , అధ్యాపకులు కార్యక్రమంలో పాల్గొని, ప్రతిభను ప్రదర్శించి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు.

'గణిత ప్రజ్ఞాధారణ'



ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మండలంలోని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించు కొని గణితంపై "గణిత ప్రజ్ఞాధారణ" అనే వినూత్న కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు లలిత మాట్లాడుతూ గణితంలో మారో నూతన కార్యక్రమం "గణిత ప్రజ్ఞాధారణ" అని అన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు, గణిత ఫోరం రాష్ట్ర సభ్యులు గణిత అవధాని, కార్యక్రమ శిక్షకులు హెచ్.అరుణ శివప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు హేమ, పునీత్, చందన, చరిష్మా, నవ్య, లహరి, రేవతి, చాణిక్య, సంధ్య, అనే తొమ్మిది మంది ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. గణిత అవధాని అరుణ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇలాంటి కార్యక్రమం చేయడం గర్వ కారణమని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు సంజీవి రమాదేవి, పిల్లారప్ప, ధన శేఖర్, కవిత, మోహన్ రెడ్డి, చిట్టి బాబు, ప్రేమ కృష్ణ, భారతి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ప్రజాశక్తి- రామకుప్పం: మండల పరిధిలోని బందార్లపల్లి పంచాయతీ.. లింగాపురం గ్రామంలో ఇటీవల ఓ ఇంటిలో గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు పూర్తిగా దెబ్బతిని అగ్నికి ఆహుతైంది. మంగళవారం పలువురు దాతలు ఆ కుటుంబ యజమాని రాజగోపాల్‌కు ఆర్థిక సాయం అందజేశారు. హెల్పింగ్ యంగ్ మైండ్ సభ్యులు బందార్లపల్లి సర్పంచ్, రామకుప్పం ప్రజావేదిక అడ్మిన్ రాజగోపాల్ ఆధ్వర్యంలో రూ.10 వేల నగదును తమవంతు తక్షణ సాయంగా అందించి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వైఎం సభ్యులు ఆడిటర్ రామలింగం, మొరం మంజునాథ్, తరిగొండ మహేష్, గోపి, హరినాథ్, అశ్వత్ బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రాజధానులకు మద్దతుగా బహిరంగ సభ



ప్రజాశక్తి - పలమనేరు: పలమనేరు పోలీసు స్టేషన్ వద్ద బుధవారం మూడు రాజధానులకు మద్దతుగా భారీ బహరంగ సభ నిర్వ హించనున్నట్లు ఎమ్మెల్యే వెంకటే గౌడ ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని వైసీపీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు భారీగా తరలి రావాలని ఎమ్మెల్యే కోరారు.

బైరెడ్డిపల్లి: మూడు రాజధానులకు మద్దతుగా పలమనేరులో భారీ ర్యాలీ నిర్వహించబడునని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి. ఎంపీపీ మగసాల రెడ్డప్ప అన్నారు. మండలంలోని వైసీపీ ఎంపిటిసిలు, సర్పంచులు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ వైసిపి అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సినీ హీరో ఘట్టమనేని కృష్ణ మృతికి సంతాపం

- సీపీఎం జిల్లా కార్యదర్శి వాడా గంగరాజు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: తెలుగు సినీహీరో సూపర్‌స్టార్ కృష్ణ మృతికి సీపీఎం జిల్లా కమిటీ సంతాపం తెలియజేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వాడా గంగరాజు తెలిపారు. సూపర్‌స్టార్ కృష్ణ 340 సినిమాలకు పైగా హీరోగా నటించారని.. అత్యంత ప్రతిష్టాత్మకమైన అల్లూరి సీతారామరాజు లాంటి దేశభక్తి సినిమాలను నిర్మించి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. రాయలసీమకు కరువు వచ్చిన సమయంలో ఆయన సినీఇండస్ట్రీ నుంచి నిధులు సమకూర్చారని తెలిపారు. ఆయన మృతిపై సంతాపం వ్యక్తం చేస్తూ మహేశ్‌బాబు తదితర కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

గంగాధరనెల్లూరు: ప్రముఖ సినిమా నటుడు కృష్ణ మంగళవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మరణించిన విషయం తెలిసిందే. ఈ సమాచారం తెలుసుకొని గంగాధరనెల్లూరు బస్‌స్టాప్ కూడలిలో కృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. క్రిష్ణఫ్యాన్స్, మహేష్ బాబు ఫ్యాన్స్ మండల అధ్యక్షులు లోకనాథం, ఆనంద్, అభిమానులు ధనరాజ్, కృష్ణన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా వేగవంతం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమం వేగవంతంగా జరుగుతోందని.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు సంబంధించిన ప్రక్రియ మరింత జాగ్రత్తగా నిర్వహించబడుతుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్. రాజశేఖర్ అన్నారు. మంగళవారం ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్ అధికారి డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో ఆన్‌లైన్ విధానంలో 2,97,337 మంది, ఆఫ్‌లైన్‌లో 77,262 మంది గ్రాడ్యుయేట్లు దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, ఇప్పటి వరకు 1,56,946 దరఖాస్తులు అంగీకరించగా.. 10,301 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయని.. విచారణ క్షేత్రస్థాయిలో జరుగుతోందని తెలిపారు. అలాగే టీచర్ల స్థానానికి సంబంధించి ఆన్‌లైన్‌లో 17,618 దరఖా స్తులు, ఆఫ్‌లైన్‌లో 2,491 దరఖాస్తులు వచ్చాయని.. 3,743 దరఖాస్తులు ఆమోదించగా 373 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయని వివరించారు. టీచర్ల ఓటరు లిస్టు కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్హత ప్రమాణాల మేరకు పరిశీలించబడుతోందని.. 17వ తేదీ సాయంత్రం లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు.